

నల్లమలలోని సలేశ్వరం లోయ


అడవిలో సంచరిస్తున్న పులి


అక్కమహా దేవి గుహలు


ఉమామహేశ్వర ఆలయం(ఫైల్)

టూరిజం హబ్‌గా.. నల్లమల


నల్లమలలో కృష్ణానది అందాలు(ఫైల్)

- పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి
- సమీక్షా సమావేశంలో అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- దక్షిణ తెలంగాణకు తలమానికం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్
- అడవిలో పలు శైవ క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు
- ఉమామహేశ్వరం వద్ద రోప్ వే ఏర్పాటు చేస్తే డెవలప్‌మెంట్ అయ్యే అవకాశం

అచ్చంపేట, మార్చి 17: నాగర్‌కర్నూల్ జిల్లాలోని నల్లమల ప్రాంతం టూరిజం హబ్‌గా మారనుంది. ఇక్కడ ఎకో టూరిజం అభివృద్ధికి అటవీ, పర్యాటక శాఖలు సంయుక్తంగా కార్యాచరణ రూపొందించాలని గత శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి చెందిన ముఖ్యమంత్రి సొంత ప్రాంతం అభివృద్ధికి చర్యలు తీసుకోవడంపై జిల్లా ప్రజలు, ప్రకృతి ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో నల్లమలకు ప్రత్యేకత ఉంది. దట్టమైన అభయారణ్యం, ఎత్తయిన కొండలు, జలపాతాలు, వన్య ప్రాణుల సందడి, పక్షుల కిలకిలరావాలు, ఔషధ మొక్కలకు నెలవుగా మారింది. ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. మరో అమర్‌నాథ్ యాత్రగా పిలిచే సలేశ్వరం ఉత్సవాలు నల్లమల అభయారణ్యంలో మూడు రోజుల పాటు జరుగుతాయి. మూడు లక్షలకుపైగా భక్తులు, పర్యాటకులు ఈ వేడుకల్లో పాల్గొంటారు. సలేశ్వరం లింగమయ్య స్వామి దర్శనం కోసం అటవీశాఖ ఇప్పటికే రోజు వారి దర్శనం కోసం కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖకు అనుమతుల కోసం నివేదికలు ఇచ్చింది.

పర్యాటక ప్రాంతాలెన్నో..

నాగర్‌కర్నూల్ జిల్లాలోని నల్లమలలో గల అమ్రాబాద్ అభయారణ్యం 2,163 చదరపు కిలో మీటర్ల మేర విస్తరించి ఉంది. ఇక్కడి అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ దక్షిణ తెలంగాణకే తలమానికంగా నిలుస్తోంది. అడవిలో రెండు తెలుగు రాష్ట్రాలకు సరిహద్దుగా కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. అమ్రాబాద్ మండలంలో 765వ జాతీయ రహదారి 70 కిలో మీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ మార్గం ద్వారానే భక్తులు, పర్యాటకులు శ్రీశైలం వెళ్తుంటారు. నల్లమలలోని ప్రతాప రుద్రునికోట, ఉమామహేశ్వర క్షేత్రం, లొద్దిమల్లయ్య, సలేశ్వరం, భౌరాపురం ఆలయం, వ్యూపాయింట్, మల్లెల తీర్థం, అక్కమహాదేవి గుహలు, కదలివనం, అంతర్ గంగ, ఆక్టోపాస్ వ్యూ తదితర సుందర ప్రాంతాలున్నాయి. ఉమామహేశ్వర ఆలయాన్ని, మల్లెల తీర్థాన్ని పర్యాటక శాఖ కొంత అభివృద్ధి చేయగా, వ్యూ పాయింట్, ఆక్టోపస్ వ్యూలను అటవీ శాఖ అభివృద్ధిలోకి తెచ్చింది. మిగతా ప్రాంతాలనూ అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందనుంది.

పర్యాటక అభివృద్ధికి అటవీశాఖ అడ్డంకులు

నల్లమలలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అటవీ శాఖ మోకాలు అడ్డేస్తోంది. ఇక్కడ డెవలప్‌మెంట్ చేపడితే యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతోపాటు ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందనుంది. ఉమామహేశ్వర క్షేత్రం, సలేశ్వరం, మల్లెల తీర్థాలలో రోప్ వేలను ఏర్పాటు చేస్తే పర్యాటకుల సంఖ్య పెరుగనుంది. వటవర్లపల్లి, దోమలపెంట వెళ్లే దారిలో ప్రధాన రహదారి నుంచి దాదాపు ఏడు కిలో మీటర్ల దూరంలోని అక్కమహాదేవి గుహల వరకు రోడ్డు నిర్మిస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందనుంది. ఇక్కడి చరిత్ర అందరికీ తెలుస్తుంది. నల్లమలలో పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఆదేశించడం, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జిల్లాకు చెందిన జూపల్లి కృష్ణారావు ఉండటంతో అవన్నీ నెరవేరుతాయన్న ఆశాభావం వ్యక్తమౌతోంది.

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపునకు బాటలు



అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని నల్లమల శైవక్షేత్రాలకు ప్రత్యేకం. ఈ ప్రాంత పర్యాటక అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడం హర్షణీయం. సీఎం నిర్ణయంతో పర్యాటకం వేగంగా అభివృద్ధి అవుతుంది. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా బాటలు పడనున్నాయి. మద్దిమడుగు ఆలయ అభివృద్ధి కోసం రూ.25 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఉమామహేశ్వర కొండపై రోప్‌వే, కొండ దిగువన కాటేజీలు, పార్కు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నాం.

- వంశీకృష్ణ, అచ్చంపేట ఎమ్మెల్యే

ఉన్నతాధికారులకు నివేదికలు ఇస్తాం



నల్లమలలో ఎన్నో పర్యాటక కేంద్రాలున్నాయి. అటవీ చట్టం వల్ల అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. ముఖ్యమంత్రి నిర్ణయంతో ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది. ఉన్నతాధికారుల ఆదేశానుసారం పర్యాటక ప్రాంతాలను పూర్తి స్థాయిలో గుర్తించి, నివేదికలు అందజేస్తాం. ఏడాదికి ఒక్కసారి జరిగే సలేశ్వరం ఉత్సవాలు మూడు రోజులే ఉండటంతో లక్షలాది మంది భక్తులు ఒక్కసారిగా వస్తున్నారు. దాంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిర్దిష్టమైన సంఖ్యలో రోజూ సలేశ్వరం దర్శనం కోసం అనుమతి ఇవ్వాలని ఉన్నతాధికారులకు గతంలోనే నివేదికలు ఇచ్చాం.

- ఆదిత్య, ఫారెస్ట్ రేంజ్ అధికారి

పాలమూరుకు.. పదవులు



- ఎమ్మెల్యే టికెట్ ఆశావహులను వరిస్తున్న కార్పొరేషన్‌లు
- ఇప్పటికే జిల్లాలో ముగ్గురికి కీలక పదవులు.. తాజాగా మరో ముగ్గురికి అవకాశం

మహబూబ్‌నగర్, మార్చి 17: పాలమూరు జిల్లాకు పదవుల వరద పారుతోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ముగ్గురు నాయకులకు కీలక పదవులు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా ఇచ్చిన కార్పొరేషన్ చైర్మన్‌లలో మరో ముగ్గురికి అవకాశం కల్పించింది. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కోసం పోటీపడి, సీఎం రేవంత్ హామీతో పోటీ నుంచి తప్పుకున్న వారికి ప్రభుత్వ పదవులు, కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇస్తూ సర్దుబాటు చేస్తున్నారు. తద్వారా ఎన్నికల ముందు ఇచ్చిన మాటను సీఎం నిలబెట్టుకుంటున్నారు. ఇప్పటికే వనపర్తికి చెందిన మాజీ మంత్రి జి.చిన్నారెడ్డికి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడి పదవి కట్టబెట్టగా, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధితోపాటు.. క్రీడలకు ప్రభుత్వ సలహాదారునిగా నియమించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన మైనారిటీ నాయకుడు ఒబేదుల్లా కొత్వాల్‌కు తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. తాజాగా ప్రభుత్వం రాష్ట్రంలో మరికొందరికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇవ్వగా.. అందులో ఉమ్మడి పాలమూరుకు చెందిన ముగ్గురిని వరించాయి. సీఎం నియోజకవర్గం కొడంగల్‌కు చెందిన సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డికి కీలకమైన పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇచ్చారు. పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఈయన గత ఎన్నికల్లో పోటీ చేయకుండా.. రేవంత్ గెలుపు కోసం పని చేశారు. ఇక వనపర్తిలో ఎమ్మెల్యే టికెట్ కోసం మేఘారెడ్డి, చిన్నారెడ్డితోపాటు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి కూడా పోటీ పడ్డారు. చిన్నారెడ్డి పేరును ముందుగా ప్రకటించినా.. తరువాత మేఘారెడ్డిని అభ్యర్థిగా నిర్ణయించారు. ఆ సమయంలో ప్రభుత్వం ఏర్పాటు తరువాత సముచిత స్థానం ఇస్తామని చిన్నారెడ్డికి చెప్పడంతో ఆయన తప్పుకున్నారు. చెప్పినట్లుగానే ఆయనకు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడి పదవి ఇచ్చారు. ఇక టికెట్ ఆశించిన మరో నాయకుడు శివసేనా రెడ్డిని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా నియమించారు. కొల్లాపూర్‌లో ముందు నుంచి కాంగ్రెస్ టికెట్‌పై జగదీశ్వర్‌రావు ఆశలు పెట్టుకోగా, జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్‌లో చేరి, టికెట్ పొందారు. దాంతో జగదీశ్వర్‌రావుకు నీటి అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. ఇలా ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో ఉమ్మడి పాలమూరులో ఆరుగురికి పదవులు దక్కాయి. మరికొందరు సీనియర్ నాయకులు కార్పొరేషన్ పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. పాలమూరు నియోజకవర్గంలో బీసీ నాయకులకు అవకాశం కల్పించడం లేదని సామాజిక మాధ్యమాలలో విరివిగా పోస్టింగ్‌లు పెడుతున్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన బీసీ నాయకులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

మళ్లీ అవే పదవులు

ప్రభుత్వాలు ఏవైనా పలు పదవులు జిల్లా వ్యక్తులకే వస్తుండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో వనపర్తికి చెందిన నిరంజన్‌రెడ్డికి 2014లో ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడి పదవిని ఇచ్చారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే నియోజకవర్గానికి చెందిన చిన్నారెడ్డికి ఇదే పదవిని కట్టబెట్టడం గమనార్హం. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ పదవి జిల్లాకు దక్కడం ఇది మూడోసారి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొదటిసారి ఏర్పాటైన తరువాత దేవరకద్ర నియోజకవర్గానికి చెందిన అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డికి ఈ పోస్ట్ ఇవ్వగా, రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత గద్వాలకు చెందిన ఆంజనేయులుగౌడ్‌కు కట్టబెట్టారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం వనపర్తికి చెందిన శివసేనారెడ్డికి ఇదే పదవిని అప్పగించింది. ఇక మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లా కేంద్రానికి చెందిన ఇంతియాజ్ ఇసాక్‌కు ఇవ్వగా, ఇప్పుడు కాంగ్రెస్ జిల్లా కేంద్రానికి చెందిన ఒబేదుల్లా కొత్వాల్‌కు ఈ పదవిని ఇవ్వడం విశేషం. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పదవి జిల్లాను వదలడం లేదు. వైఎస్ హయాంలో ఈ పదవిని మాజీ ఎంపీ మల్లురవి చేపట్టారు. ఆ తరువాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాకు చెందిన మందా జగన్నాథ్‌కు ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మళ్లీ మల్లురవికి ఈ పదవి ఇచ్చినా.. కొద్ది రోజులకే ఆయన రాజీనామా చేశారు. తాజాగా పార్టీలో చేరిన మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డికి మరోసారి ఇదే పదవి లభించడం గమనార్హం.

ఆల్ ద బెస్ట్

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు
- కేంద్రాల వద్ద 144 సెక్షన్
- ఐదు నిమిషాలు ఆలస్యమైతే అనుమతి నిరాకరణ


మహబూబ్‌నగర్‌లోని ఓ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో రవీందర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 17: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలకు విద్యా శాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. గత ఏడాదిలో జరిగిన పొరపాట్లను దృష్టిలో పెట్టుకుని.. నిబంధనలు కఠినంగా అమలు చేసేలా చర్యలు తీసుకున్నారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా ఏర్పాట్లు చేపట్టారు. రెవెన్యూ మండల పరిషత్, విద్య ఇతర శాఖల అధికారులతో పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పరీక్ష కేంద్రంలోకి ఎట్టి పరిస్థితుల్లో సెల్‌ఫోన్ తీసుకెళ్లొద్దని ఆదేశాలు జారీ చేశారు. పరీక్షల నిర్వహణ కోసం 59 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 59 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను ఎంపిక చేసి, ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. వారితో పాటు ప్రత్యేక స్క్వాడ్ బృందాలు, ఇన్విజిలేటర్లను నియమించారు. విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు చేరవేసేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపనుంది. హాల్ టికెట్ చూపిస్తే విద్యార్థులు ఉచితంగా ప్రయాణం చేయొచ్చు.

తొమ్మిది గంటల నుంచే అనుమతి

పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించనున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలి. తొమ్మిది గంటల నుంచే పరీక్ష హాలులోకి అనుమతిస్తారు. ఐదు నిమిషాలు ఆలస్యమైనా.. పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమని అధికారులు చెబుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని సూచించారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

మహబూబ్‌నగర్ జిల్లాలో పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డీఈవో రవీందర్ తెలిపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాము. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశాం. ఇప్పటికే విద్యార్థులందరికీ హాల్ టికెట్లు అందించాం. పరీక్షలు ప్రశాంతగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం.

- రవీందర్, డీఈవో

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, పరీక్ష కేంద్రాల వివరాలు

జిల్లా	మొత్తం విద్యార్థులు	బాలురు	బాలికలు	కేంద్రాలు
మహబూబ్‌నగర్	12,866	6,419	6,292	59
నాగర్‌కర్నూల్	10,526	5,209	5,317	59
వనపర్తి	6,903	3,482	3,421	35
నారాయణపేట	7,678	3,602	4,076	38
జోగులాంబ గద్వాల	7,377	3,575	3,802	41

పాలమూరు వర్సిటీలో.. లా, ఇంజనీరింగ్ కళాశాలలు

- ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించేందుకు కసరత్తు
- కొత్త కోర్సులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- ప్రతిపాదనలు పంపించాలన్న ఉన్నత విద్యా మండలి



పాలమూరు యూనివర్సిటీ

పాలమూరు యూనివర్సిటీ, మార్చి 17: పాలమూరు యూనివర్సిటీలో లా, ఇంజరింగ్ కళాశాలలను ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించాలని అటు ప్రభుత్వం, ఇటు ఉన్నత విద్యామండలి కసరత్తు మొదలు పెట్టాయి. విద్యార్థి సంఘాల ఆందోళనలో నేపథ్యంలో ఆయా కోర్సులను ఏర్పాటు చేయాలని వర్సిటీ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం కావాల్సిన ఏర్పాట్లు చేయాలని గత నెలలో ఉన్నత విద్యామండలికి ఆదేశాలు ఇచ్చింది. దాంతో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ), బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) నిబంధనల ప్రకారం ఉన్నత విద్యా మండలి వర్సిటీలో ఈ విద్యా సంవత్సరమే లా, ఇంజనీరింగ్ కళాశాలలను ప్రారంభించాలని భావిస్తోంది. భవనాలు, టీచింగ్, నాన్ టీచింగ్, ఇతర మౌలిక వసతులకు అయ్యే ఖర్చులు, నిధులకు సంబంధించి ప్రతిపాదనలు వీలైనంత త్వరగా ప్రభుత్వానికి పంపాలని వర్సిటీ అధికారులకు ఈ నెల 14న ఉన్నత విద్యా మండలి సర్క్యులర్ జారీ చేసింది. దాంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

1.25 లక్షల మందికి చదువు

వెనుకబడిన పాలమూరు ఉమ్మడి జిల్లాలో ఉన్నత విద్యను అందించేందుకు 2008లో పాలమూరు యూనివర్సిటీని ఏర్పాటు చేశారు. ముందుగా వర్సిటీని ఐదు కోర్సులతో ప్రారంభించారు. ఎన్‌సీటీఈ, పీసీఐ, 12బీ, న్యాక్ బీ గ్రేడ్‌తో వర్సిటీ ద్వారా దాదాపు 1.25 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇదే నెలలో కేంద్ర ప్రభుత్వం వర్సిటీకి రూ.100 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే.

పేద విద్యార్థులకు కష్టాలు తప్పుతాయి



పాలమూరు యూనివర్సిటీలో ఆర్ట్స్, సైన్స్ కోర్సులు మాత్రమే ఉన్నాయి. లా, ఇంజనీరింగ్, జర్నలిజం లాంటి ప్రొఫెషనల్ కోర్సులు లేకపోవడంతో పేద విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు. ఆ కోర్సులను ఏర్పాటు చేయాలని ఇటు అధికారులు, అటు రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాము. పీయూ వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్, స్థానిక ఎంమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి లా, ఇంజనీరింగ్ కాలేజ్‌లను ఏర్పాటు చేసేలా కృషి చేశారు. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

- బత్తిని రాము, పీయూ విద్యార్థి నాయకుడు

అత్యున్నత వర్సిటీగా మారుస్తాం



పాలమూరు వర్సిటీలో ఈ విద్యా సంవత్సరం నుంచి లా, ఇంజనీరింగ్ కాలేజ్‌లను ప్రారంభించాలని, అందుకు కావాల్సిన ఏర్పాట్లకు నిదులు, ఇతర వసతులకు ప్రతిపాదనలు పంపాలని ఉన్నత విద్యా మండలి సూచించింది. ఆ పనుల్లో మా అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే వర్సిటీకి కేంద్రం నుంచి ఇటీవల రూ.100 కోట్లు మంజూరయ్యాయి. వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తున్న స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లా మంత్రులు, సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు. పీయూను రాష్ట్రంలోనే అత్యున్నత వర్సిటీగా మారుస్తాం.

- ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్, పీయూ వీసీ

ధాత్రి పాల కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు

- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్
- సుషేణ హెల్త్ ఫౌండేషన్‌తో చర్చలు


ధాత్రి పాలకేంద్రం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ జీవన్, సుషేణ సంస్థ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), మార్చి 17 : ధాత్రి పాలకేంద్రాన్ని ఏర్పాటు చేయడం వలన నవజాత శిశువులకు ఎంతో మేలు జరుగుతుందని జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్ తెలిపారు. సుషేణ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పాల కేంద్రాన్ని జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసే విషయమై ఫౌండేషన్ ప్రతినిధులతో పాటు ఆయన ఆదివారం ఆసుపత్రిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో ధాత్రి పాలకేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీని ద్వారా పాలు అందని నవజాత శిశువులకు పాలు అందించే ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన స్థలం, సామగ్రిని ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంతోష్‌కుమార్ భరద్వాజ్ మాట్లాడుతూ తల్లిపాలను దానం చేయగల తల్లుల నుంచి పాలను సేకరించి ఈ కేంద్రంలో నిల్వ ఉంచుతామని తెలిపారు. పాలు అందలేని పిల్లలకు ఈ పాలను అందిస్తామని తెలిపారు. ఈ పాల ద్వారా ఎలాంటి దుష్ప్రభావాలు లేవని, ఇదివరకే హైదరాబాద్‌లోని నీలోఫర్, గాంధీ, ఈఎస్‌ఐ ఆసుపత్రులతో పాటు మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలోని ఆసుపత్రుల్లో విజయవంతంగా కొనసాగుతుందన్నారు. అనంతరం ధాత్రి మిల్క్‌బ్యాంకుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ సురేష్, ఇతర వైద్యులు డాక్టర్ జగదీష్, డాక్టర్ సిరాజుద్దీన్, డాక్టర్ విజయ్, డాక్టర్ గణేష్, సుషేణ సంస్థ ప్రతినిధులు ధరణి, గుట్టా శోభన్, పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ - ఒకరు మృతి

- ముగ్గురికి తీవ్ర గాయాలు

బిజినేపల్లి, మార్చి 17 : ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం నుంచి నాగర్‌కర్నూల్ వైపు వెళ్తున్న బైకు నాగర్‌కర్నూల్ వైపు నుంచి మరో బైక్‌పై ముగ్గురు వస్తుండగా కోటాలగడ్డ సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రం ముందు వేగంగా ఢీకొట్టుకున్నాయి. ఒక బైకుపై ఉన్న ముగ్గురిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో బైక్‌పై ఉన్న వ్యక్తితో కలిపి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారమివ్వడంతో చికిత్స కోసం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తి గాయపడిన వ్యక్తుల వివరాలు తెలియరావాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శ్రీశైలం మల్లన్న సన్నిధికి పాదయాత్ర

- 29 ఏళ్ల క్రితం ఐదుగురితో ప్రారంభమై, 900మంది దాకా..

- హీరేమట్ గురూజీ వీరేశ్వర శివాచార్యుల ఆధ్వర్యంలో యాత్ర



భూత్పూర్ సాక్షి గణపతి దేవాలయంలో భక్తులతో వీరేశ్వరశివాచార్యులు

భూత్పూర్, మార్చి 17 : సంగారెడ్డి జిల్లా, జహీరాబాద్ మండలం ధనసిరి గ్రామానికి చెందిన హీరేమట్ గురూజీ వీరేశ్వరశివాచార్యులు.. ఈయనను భక్తులు అప్పాజీ అని పిలుస్తుంటారు. 29 ఏళ్ల క్రితం ఐదుగురితో శ్రీశైలానికి పాదయాత్రగా ప్రారంభించారు. ప్రతీఏటా శివరాత్రి అయిన మొదటి బుధవారం రోజున వీరు శ్రీశైలం దర్శనం కోసం ధనసిరి గ్రామం నుంచి పాదయాత్రగా బయలుదేరుతారు. అదేవిధంగా కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు ఈ పాదయాత్రలో తలివస్తుంటారని గురూజీ తెలిపారు. ఆదివారం వీరి పాదయాత్ర భూత్పూర్ మండలంలోని సాక్షి గణపతి దేవాలయం దగ్గరకు చేరుకున్నది. ఈ సందర్భంగా హీరేమట్ గురూజీ వీరేశ్వరశివాచార్యులు భక్తుల నుద్దేశించి కాసేపు మాట్లాడారు. శ్రీశైలం పాదయాత్రగా వెళ్లడం అనేది చాలా ముఖ్యమైనదని, శివయ్య అనుగ్రహం పొందాలంటే అంతా సులభమైనది కాదని, ఎంతో కఠోర శ్రమ, మనస్సు నిండా భక్తి (శివయ్య నామస్మరణ) ఉంటేనే ఆయన అనుగ్రహం లభిస్తుందన్నారు. 29ఏళ్లుగా శివయ్యను తల్చుకొని ఇంటి నుంచి బయలు దేరివెళుతుంటానని, ప్రస్తుతం తొమ్మిదివందల మంది శివయ్య దర్శనం కోసం స్వచ్ఛందంగా తరలిస్తున్నారని అన్నారు. ఈ నెల 22న శ్రీశైలం చేరుకొని శివయ్యను సాధారణ దర్శనం చేసుకుంటామని పేర్కొన్నారు. ఇన్నేళ్ల పాటు ఎర్రటి ఎండలో నడుచుకుంటూ వెళ్తున్నా భక్తులకు ఏ ఆపదా తలెత్తలేదని అన్నారు. కార్యక్రమంలో హర్పీ అశోక్, ప్రభాకర్‌రెడ్డి, స్థానిక దేవాలయ అర్చకులు శివశంకర్, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం

తెలకపల్లి, మార్చి 17 : నాగర్‌కర్నూల్ మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఆంజనేయస్వామి గుడి సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక ఎడ్లబండి, వ్యవసాయ పనిముట్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. మండల కేంద్రానికి చెందిన కాశన్న అనే రైతుకు సంబంధించిన ఎడ్లబండి వ్యవసాయ పనిముట్లు అగ్నికి ఆహుతి అయ్యాయని దీని విలువ సుమారు 30వేల వరకు ఉండవచ్చునని రైతు తెలిపారు.

600 కేజీల బెల్లం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బెల్లం, నవసారంతో ఎక్సైజ్ అధికారులు

కొత్తకోట, మార్చి 17: పట్టణంలో అక్రమంగా నిల్వ చేసిన బెల్లంతో పాటు నవసాగరం ఎక్సైజ్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. వినయ్ కుమార్ ఇంట్లో సారా తయారికి ఉపయోగించే బెల్లం ఉన్నట్లు ఎక్సైజ్ సీఐ కరుణకు అందిన సమాచారం మేరకు దాడులు చేశారు. ఈ దాడులలో 600 కేజీల బెల్లం, 16.5 కేజీల నవసాగరం సంచులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు నమోముద చేసినట్లు సీఐ తెలిపారు.

సైబర్ ఉచ్చులో యువత

- ఉమ్మడి గండీడ్ మండలంలో రూ. లక్షలు నష్టపోయిన ప్రజలు
- ప్రతీ రోజు రూ. వేలల్లో ఆదాయం చూపి రూ. కోటి వరకు మోసగించిన కేటుగాళ్లు
- ఎలాంటి ఫిర్యాదులు అందలేదు : ఎస్ఐ శేఖర్‌రెడ్డి



మహమ్మదాబాద్, మార్చి 17 : సైబర్ మోసాలకు యువత బలై లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. ఫేక్ కంపెనీలు వివిధ వెబ్‌సైట్‌ల పేర్లతో నిర్వహించి కంపెనీల్లో పెట్టుబడులు పెడితే వాటికి రెట్టింపు డబ్బులు ఇస్తామని ఆశచూపి గ్రామీణ ప్రాంత ప్రజలను బురిడీ కొట్టించారు. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్, గండీడ్ మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో ఈ వ్యవహారం జోరుగా సాగుతోంది. మహమ్మదాబాద్ మండల పరిధిలోని నంచర్ల గ్రామంలోనే 50 నుంచి 60 మందికి పైగా బాధితులు ఓ వెబ్‌సైట్ ఫేక్ కంపెనీలో రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి మోసపోయారు. ఉమ్మడి మండలంలో వివిధ గ్రామాల్లో యువకులు ఆన్‌లైన్‌లో దాదాపు రూ. కోటి వరకు అప్పులు చేసి ఈ కంపెనీలో పెట్టుబడులు పెట్టి మోసపోవడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. సంబంధిత వెబ్‌సైట్ కంపెనీ నుంచి వారం రోజులుగా ఎలాంటి లావాదేవీలూ నిర్వహించకుండా నిలిచిపోవడంతో ఒక్కసారిగా పెట్టుబడులు పెట్టిన వారంతా లబోదిబోమంటున్నారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన బాధితులు ఎవరికీ చెప్పుకోలేక తమలో తాము మదనపడుతున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయకుండా జంకుతున్నారు.

కంపెనీవారు మొదటగా రూ.800 నుంచి మొదలుకొని రూ.లక్ష వరకు పెట్టుబడులు పెట్టిన డబ్బులకు ప్రతీ రోజు కొంత డబ్బును వారి అకౌంట్లలో జమ చేసేవారు. ప్రతీ రోజు డబ్బులు అకౌంట్లలో జమకావడంతో వారిలో ఆశలు పెరిగి మొదట మూడు వేలు, ఐదు వేలు పెట్టిన వారు తర్వాత అత్యాశకు పోయి రూ.25 వేల నుంచి రూ.75 వేల వరకు ఇలా అప్పులు చేసి కంపెనీలో పెట్టుబడులు పెట్టారు. వారం రోజుల కిందట కంపెనీ ఆకర్షణీయమైన బహుమతులు ప్రకటించడంతో బాధితులు మరింత ఉత్సాహంగా పెట్టుబడులు పెట్టడమేకాకుండా తమ బంధువులు, స్నేహితులు, తెలిసిన వారికి సమాచారం అందించారు. దీంతో రెండు, మూడు రోజుల్లో గణనీయంగా పెట్టుబడులు పెరిగాయి. మూడువేలు పెడితే రూ.12 వేలు ఇస్తామని, రూ. ఐదువేలు పెడితే ఇరవై వేలు ఇస్తామని, రూ. 12 వేలు పెడితే రూ.30 వేలు ఇస్తామని ప్రచారం జరగడంతో ప్రజలు పెద్దమొత్తంలో డబ్బులు పెట్టారు. మొదట చెప్పిన ప్రకారం డబ్బులు పెట్టిన 24 గంటల్లో బాధితుల ఖాతాల్లో జమకావాల్సి ఉండగా నాలుగు రోజులైనా ఒక్క రూపాయి డబ్బు జమకాకపోవడంతో కంపెనీకి సంబంధించిన వాట్సప్ గ్రూపుల్లో మెసేజ్ పెట్టేపనిలో పడ్డారు. ఒకేసారి వెబ్‌సైట్ మూసేస్తే కస్టమర్లకు అనుమానం వస్తుందని, ఏదో ఒక ఆశచూపుతూ ఒకరిద్దరి అకౌంట్లలో డబ్బులు వేశారని బాధితులు చెపుతున్నారు. అకౌంట్లలో వేసినవారికి కూడా రూ.110 మాత్రమే వేసినట్లు బాధితులు చెపుతున్నారు. మరో రూ.వెయ్యి కంపెనీ అకౌంట్లలో వేస్తే రూ.5000 వేలు జమ చేస్తామని, రూ.రెండు వేలు వేస్తే రూ.10వేలు జమ చేస్తామని ఇలారోజుకో ట్విస్ట్ పెడుతూ, బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో పోయినా డబ్బులు తిరిగివస్తాయా? రావా? అన్న ఆందోళనలో ఉన్నారు. సైబరు నేరాలకు సంబంధించి ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కేవలం వాట్సప్‌లో వస్తున్న సమాచారం మాత్రం చూశామని, యువత సైబర్ ఉచ్చులో పడి మోసపోవద్దని, ఏదైనా మోసపూరిత సమాచారం వస్తే తమ దృష్టికి తేవాలన్నారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

మానవపాడు, మార్చి 17: పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన గద్వాల జిల్లా మానవపాడు మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అమరవాయి గ్రామానికి చెందిన లచ్చగౌడ్ కుమార్తె ఇంద్రజ (27) ఆరేళ్ల క్రితం గట్టు మండలంలోని తప్పెట్లమొర్సు గ్రామానికి చెందిన గోవర్ధన్ గౌడ్‌తో వివాహం అయింది. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ నెల 5న తమ నానమ్మ నెల పూజ ఉందని అమరవాయి గ్రామానికి ఇంద్రజ వచ్చింది. కార్యక్రమాలు పూర్తికాగా భర్త శనివారం అమరవాయికి వచ్చి తమ గ్రామానికి వెళ్దామని చెప్పాడు. దాంతో ఆమె తనకు బ్యూటీషన్ అంటే ఇష్టమని షాపు పెట్టించాలని కోరింది. ప్రస్తుత పరిస్థితుల కారణంగా పెట్టలేమని తరువాత చూద్దామని చెప్పాడు. దాంతో బాత్‌రూమ్‌లోకి వెళ్లి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించేలోగా ఇంద్రజ మృతి చెందింది. ఈ విషయంపై ఇంద్రజ తండ్రి లచ్చగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

జడ్చర్ల, మార్చి 17 : జడ్చర్ల కొత్తబస్టాండులో ఓ మహిళ అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. విశ్వసనీయ సమాచారం మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా నాగనూలుకు చెందిన నాగరాణి(40) మూడు రోజుల క్రితం కూతురును కలుసుకునేందుకు చందాపూర్‌కు వెళ్తున్నట్లుగా ఇంట్లో చెప్పి వెళ్లింది. అక్కడి నుంచి తిరిగి స్వంత గ్రామానికి వెళ్తూ ఆదివారం జడ్చర్ల కొత్తబస్టాండులో ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. నాగనూలులో నివాసం ఉంటున్న నాగరాణి భర్త వెంకటయ్యకు స్థానికులు సమాచారం అందించారు. కాగా ఈ సంఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని జడ్చర్ల పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అలంపూర్ చౌరస్తా, మార్చి 17: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం గద్వాల జిల్లా మానవపాడు మండలంలో చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అలంపూర్ చౌరస్తా సమీపంలో జాతీయ రహదారిపై ఈ నెల 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో మానవపాడు మండలం, నారాయణపురం గ్రామానికి చెందిన మురళీధర్‌రెడ్డి (57) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ముందు వెళ్తున్న డీసీఎం సడన్‌గా మలుపు తిరగడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. కుమారుడు అరవింద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం పట్టివేత, కేసు నమోదు

బిజినేపల్లి, మార్చి 17 : మండలంలోని పాలెంలో కిరాణం దుకాణంలో మద్యం విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం సోదా చేయగా రూ.10 వేల విలువైన మద్యం లభించినట్లు ఎస్సై నాగశేఖర్ రెడ్డి తెలిపారు. అక్రమంగా అమ్ముతున్న మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ శాఖ అధికారులకు అప్పగించి నిందితుడు శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిందితుడికి రిమాండ్



దొంగతనం చేసిన నిందితున్ని రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

గోపాల్‌పేట, మార్చి 17: స్కూల్‌లో ఎల్ఈడీ టీవీ, ఫోన్ టాబ్, ఓ బైకును దొంగిలించిన వ్యక్తిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం సాయంత్రం పోలీసులు వెహికల్ చెకింగ్ నిర్వహిస్తున్న సమయంలో మండల కేంద్రానికి చెందిన జనార్దన్ పోలీసులను చూసి పారిపోతుండగా పోలీసులు వెంబడించి పట్టుకొని విచారణ చేశారు. మండల కేంద్రంలో ఈ నెల 16న అర్ధరాత్రి బండపల్లి స్కూల్, అదే కాలనీకి చెందిన జనార్దన్ స్కూల్లోని టీవీ,టాబ్, కొమ్ము రామస్వామి బైక్ దొంగిలించినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. అనంతరం జనార్ధన్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితున్ని పట్టుకోవడంలో సహకరించిన హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ గౌడ్, కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డి, వంశీ లను అభినందించారు.

నల్లమలలో చెట్టుకు ఢీకొన్న కారు

- ఎయిర్స్ బాగ్స్ ఓపెన్ కావడంతో నలుగురు యువకులు సురక్షితం

మన్ననూర్, మార్చి 17: నల్లమల అభయారణ్య ప్రాంతంలోని శ్రీశైలం హైదరాబాద్ ఘాట్‌రోడ్డులో అతివేగంతో చెట్టును కారు ఢీకొట్టిన ఘటనలో యువకులు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. పరిగికి చెందిన నలుగురు యువకులు శ్రీశైలంలో దైవదర్శనం నిమిత్తం శనివారం రాత్రి 11గంటల సమయంలో కారులో ప్రయాణిస్తున్న క్రమంలో మన్ననూరు, దోమలపెంట మధ్యలో గల ఘాటురోడ్డు మలుపు వద్ద అతివేగంతో వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో కారు నుజ్జయింది. కారులో సాంకేతిక టెక్నాలజీ ఉన్న కారణంగా ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడం వలన నలుగురు యువకులకు చిన్నపాటి గాయాలు కూడా కాలేదు. ప్రమాద ఘటన చోటు చేసుకున్న విషయమై పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు ముందరి భాగం

ముగిసిన లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

- రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ విజేత వంకేశ్వరం జట్టు
- బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



బహుమతి ప్రదానోత్సవ సభలో మాట్లాడుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అమ్రాబాద్, మార్చి 17: నల్లమల ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన రాయలగండి లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. గత ఐదు రోజుల క్రితం ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి కోలాటం, భజన పోటీలు నిర్వహించారు. అలాగే వాలీబాల్ టోర్నమెంట్ కూడా ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం రాష్ట్రస్థాయి టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో పదర మండల పరిధిలోని వంకేశ్వరం చిట్లంకుంట వాలీబాల్ జట్లు తలపడగా హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో వంకేశ్వరం జట్టు ప్రథమ బహుమతి సాధించగా, చిట్లంకుంట జట్టుకు ద్వితీయ బహుమతి లభించింది. అలాగే అమ్రాబాద్ మండల పరిధిలోని జంగం రెడ్డిపల్లి వాలీబాల్ జట్టుకు తృతీయ బహుమతి లభించింది. ఆలయం ఆవరణలో ఆదివారం రాత్రి ఏర్పాటుచేసిన బహుమతుల పంపిణీ కార్యక్రమంలో అచ్చంపేట శాసనసభ్యుడు డాక్టర్ వంశీకృష్ణ హాజరై మాట్లాడారు. లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడానికి కృషి చేసిన ఆలయ కమిటీ చైర్మన్ ప్రధాన కార్యదర్శి నిర్వహణ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కోలాటం, భజన పోటీలు పెద్ద ఎత్తున నిర్వహించడం హర్షణీయమని ఎమ్మెల్యే అన్నారు. నల్లమల ప్రాంతం కళాకారుల, క్రీడాకారులకు నల్లమల ప్రాంతం కళాకారులు, క్రీడాకారులకు పుట్టినిల్లు లాంటిదని అన్నారు. కలలను, క్రీడలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇమ్మడి నరహరి, ప్రధాన కార్యదర్శి ఆనందు, మాచారం గ్రామానికి చెందిన అనూష కన్‌స్ట్రక్షన్ అధినేత అండపల్లి జలంధర్ రెడ్డి, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ధిక్కార స్వరానికి ప్రతీక 'గద్దెనెక్కినంక'



'గద్దెనెక్కినంక' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 17 : పాలమూరు యువ కవి కె.పి. లక్ష్మీనరసింహ రచించిన 'గద్దెనెక్కినంక' దీర్ఘ కవిత ధిక్కార స్వరానికి ప్రతీక అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. పాలమూరు సాహితి, పాలమూరు యువకవుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మహబూబ్‌నగర్ పట్టణ కేంద్రలో గల లుంబిని హైస్కూలులో 'గద్దెనెక్కినంక' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆవిష్కర్తగా విచ్చేసిన ప్రముఖ కవి వల్లభాపురం జనార్దన్ మాట్లాడుతూ లక్ష్మీనరసింహ రచించిన పుస్తకంలో కవి మనువు సృష్టించిన చాతుర్వర్ణ వ్యవస్థలోని లోపాలను ఆవిష్కరిస్తూ రచన చేశారన్నారు. వచన కవిత నుంచి దీర్ఘ కవితలోకి అరంగేట్రం చేసిన లక్ష్మీనరసింహను అభినందించారు. ఈ సభకు పాలమూరు సాహితి అధ్యక్షుడు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది బెక్కెం జనార్దన్, బోల యాదయ్య, పొన్నగంటి ప్రభాకర్, ఖాజామైనుద్దీన్, పులి జమున, కె.ఎ.ఎల్ సత్యవతి, రావూరి వనజ, గుడిపల్లి నిరంజన్, వహీద్ ఖాన్, ఎదిరేపల్లి కాశన్న, ముచ్చర్ల దినకర్ పాల్గొన్నారు.

నన్ను ఎవరూ కిడ్నాప్ చేయలేదు

- సొంత పనులపై భార్యకు చెప్పకుండా వెళ్లాను
- గాబరా పడి తను ఫిర్యాదు చేసింది
- పోలీస్‌స్టేషన్‌లో బాలానగర్ పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి



జడ్చర్లలో రూరల్ సీఐ ని కలిసిన బాలానగర్ పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

జడ్చర్ల, మార్చి 17 : 'నన్ను ఎవరూ కిడ్నాప్ చేయలేదు.. సొంత పనులపై భార్యకు చెప్పకుండా వెళ్లాను. గాబరా పడి తన భార్య పల్లవిరెడ్డి బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది' అని బాలానగర్ పీఏసీఏఎస్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి జడ్చర్ల పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ నాగార్జున్ గౌడ్‌ను కలిసి తన వాంగ్మూలం ఇచ్చారు. ఇదిలా ఉండగా ఈ నెల 12న అర్ధరాత్రి బాలానగర్ పీఏసీఎస్ అధ్యక్షుడు, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డికి చెందిన కారులో ఐదుగురు వ్యక్తులు వచ్చి తన భర్త శ్రీకాంత్‌రెడ్డిని కిడ్నాప్ చేశారంటూ పల్లవిరెడ్డి ఈ నెల 13న బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు బాలానగర్ ఎస్ఐ తిరుపాజీ కిడ్నాప్ కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. కేసు దర్యాప్తులో ఉండగానే తాజాగా శ్రీకాంత్‌రెడ్డి జడ్చర్ల రూరల్ సీఐ ముందు హాజరై తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదంటూ వాంగ్మూలం ఇవ్వడంతో కిడ్నాప్ కేసు సుఖాంతమైంది. పీఏసీఎస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డిపై గత నెల 21న జిల్లా అధికారులకు కొంత మంది డైరెక్టర్‌లు అవిశ్వాసం తీర్మానం పెట్టాలంటూ దరఖాస్తు ఇవ్వడంతో ఈ నెల 16న అవిశ్వాస పరీక్ష నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. అవిశ్వాస పరీక్షలో డైరెక్టర్‌లు పాల్గొనకుండా ఉండేందుకు ఈ నెల 12న రాత్రి నుంచి డైరెక్టర్‌లను క్యాంప్‌కు తరలించారని, ఆ క్యాంపులో శ్రీకాంత్‌రెడ్డి సైతం ఉన్నాడన్న ఆరోపణలు వచ్చాయి. డైరెక్టర్లు అంతా క్యాంపునకు తరలివెళ్లడంతో అవిశ్వాస పరీక్షలో ఎవరూ హాజరుకాకపోవడంతో అందుకు సంబంధించిన నివేదికలను జిల్లా అధికారులకు బాలానగర్ పీఏసీఎస్ సీఈవో నాగేశ్ పంపించారు.

చట్టం ప్రకారం ముందుకెళ్తాం

తన భర్త కిడ్నాప్‌కు గురయ్యాడంటూ బాలానగర్ పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి భార్య పల్లవిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదంటూ శ్రీకాంత్‌రెడ్డి తాజాగా ఇచ్చిన వాంగ్మూలం అంశంలో చట్టం ప్రకారం ముందుకెళ్తాం. శ్రీకాంత్‌రెడ్డి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నామని, ఫిర్యాదుదారు ముందు సైతం మరో పర్యాయం వాంగ్మూలం తీసుకుంటామని, కోర్టు ఆదేశాల మేరకు నడుచుకుంటామని వివరించారు.

- నాగార్జునగౌడ్, సీఐ, జడ్చర్ల రూరల్

హరికృష్ణ ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలి

- అచ్చంపేట సివిల్ ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన
- హరికృష్ణ ఆత్మహత్య లేఖ ద్వారా అనేక విషయాలు వెలుగులోకి...
- ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసిన తర్వాతే పోస్టుమార్టం చేయాలని పట్టుబట్టిన కుటుంబ సభ్యులు



అచ్చంపేట సివిల్ ఆసుపత్రి ముందు ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

అచ్చంపేట(బల్మూర్), మార్చి17: బలవన్మరణానికి పాల్పడిన హరికృష్ణ ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలని బాధిత కుటుంబ సభ్యులు ఆదివారం అచ్చంపేట సివిల్ ఆసుపత్రిలో ఆందోళన చేపట్టడంతో ఉద్రిక్త పరిస్థితికి దారి తీసింది. నాగర్‌కర్నూలు జిల్లా బల్మూరు మండలంలో పురుగుల మందు తాగి హరికృష్ణ అనే యువకుడు ఈనెల 10న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. శుక్రవారం ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించగా, అక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు హైదరాబాద్‌లోనే పోస్టుమార్టం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా కుటుంబ సభ్యుల సూచన మేరకు ఆదివారం అచ్చంపేటలో నిర్వహించేందుకు హరికృష్ణ మృతదేహాన్ని సివిల్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడికి చేరుకున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు హరికృష్ణ బలవర్మరణానికి కారణమైన, సుసైడ్ నోట్‌లో పేర్కొన్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశాకే పోస్టుమార్టం చేయాలని ఆందోళన చేపట్టారు. మృతుడి తండ్రి లక్ష్మయ్య, అక్క గౌతమిలు ఆసుపత్రిలోని వైద్యులు, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అక్కడికి చేరుకున్న బల్మూరు ఎస్ఐ బాలకృష్ణ, సూసైడ్ లేఖ ఆధారంగానే ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని, పూర్తి స్థాయి విచారణ చేపట్టిన తర్వాత కారణాలను వెలికితీసి, హరికృష్ణ కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో పోస్టుమార్టం ప్రక్రియను వైద్యులు పూర్తి చేసి మృతదేహాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు.

భూసార పరీక్షలతోనే పంటల సాగుకు మేలు



గంగారంలో భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఏజీ బీఎస్సీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ

బిజినేపల్లి, మార్చి 17 : భూసార పరీక్షలను క్రమం తప్పకుండా చేయించి లోపించిన పోషకాలను మాత్రమే అందిస్తే నేల ఆరోగ్యానికి, పంటల సాగుకు మేలు జరుగుతుందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని గంగారంలో ఆదివారం జాతీయ సేవా పథకంలో భాగంగా ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి భూసార, సాగునీటి పరీక్షల ద్వారా కలిగే లాభాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. రైతులు రెండేళ్లకొకసారి భూసార పరీక్షలు చేయించడం ద్వారా భూమిలోని అమ్ల, క్షార స్వభావాలతో పాటు నేలలో ఉన్న పోషకాల మోతాదు తెలుసుకోవచ్చన్నారు. తద్వారా సాగు చేసే పంటకు లోపించిన పోషకాలను మాత్రమే అందించడం ద్వారా సాగు ఖర్చును తగ్గించుకోవచ్చని సూచించారు. నేల స్వభావాన్ని గుర్తించి అంతకు అనువైన పంటలను ఎంపిక చేసుకొని విత్తుకోవడం ద్వారా కూడా నష్టాలను అధిగమించవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. అంతేకాకుండా సాగునీటిని కూడా పరీక్షించుకోవాలని పేర్కొన్నారు. భూసార పరీక్షకు మట్టి నమూనాను సేకరించే విధంగానే, సాగునీటిని కూడా సేకరించాలని తెలిపారు. పురుగు మందుల పిచికారి చేసేటప్పుడు వ్యక్తిగతంగా తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించి పీపీఈ కిట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రత్యేకంగా రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం జాతీయ సేవా పథకంలో భాగంగా గ్రామంలోని పరిసరాలను ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శుభ్రపరిచారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి కె.సాధన ఉన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడిద్దాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

కల్వకుర్తి, మార్చి 17 : దేశంలో మతోన్మాదాన్ని, అవినీతిని పెంచి పోషిస్తున్న బీజేపీని సార్వత్రిక ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. కల్వకుర్తి పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జాన్‌వెస్లీ హాజరై మాట్లాడారు. మతోన్మాదంతో దేశంలోని ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకునే పరిస్థితిలోకి బీజేపీ వచ్చిందన్నారు. మతాన్ని, కులాన్ని అడ్డం పెట్టుకుని దేశంలో అశాంతిని నెలకొల్పి అధికారంలోకి రావాలని చూస్తోందని విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ పాలనలో పేదలు మరింత పేదలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలను కాపాడేందుకు పెద్దపీట వేస్తూ కేంద్ర ప్రభుత్వం రాయితీలు కల్పించిందని విమర్శించారు. ఎలక్టోరల్ బాండ్ల పేరుతో అవినీతిని చట్టబద్ధం చేసే ప్రయత్నం చేసిందన్నారు. కార్పొరేట్ శక్తులు ఇచ్చే ఎలక్టోరల్ బాండ్లతో విచ్చలవిడిగా డబ్బులు పెట్టి మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తుందన్నారు. దేశ ప్రజలంతా ఏకతాటిపై కొచ్చి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని జాన్‌వెస్లీ అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు, కార్యదర్శివర్గ సభ్యులు ఆంజనేయులు, ఆర్.శ్రీనివాస్, అంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు చిలుక బాల్‌రెడ్డి, ఏపీ మల్లయ్య, బాలస్వామి, నరసింహ, ఈశ్వర్, శంకర్, మల్లేష్, దశరథం, అశోక్, శివవర్మ తదితరులు పాల్గొన్నారు.

21న చలో హైదరాబాద్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు

తెలకపల్లి, మార్చి 17 : ఈ నెల 21న నిర్వహించే ఛలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం మండల అధ్యక్షుడు ఎండి. సైదులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులను నమ్మించి మోసం చేయడం జరిగిందని, అట్టి ప్రభుత్వానికి కార్మికులు పెద్ద ఎత్తున హాజరై ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం జరిగిందని కాగా నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల వ్యవధిలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, వేతనాలు పెంచుతామని వారి మేనిఫెస్టోలో తెలియజేశారు. కానీ ఇంత వరకు పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. కార్మికుల కష్టాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలియజేయడం కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మార్చి 21న గ్రామపంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో కమిషనర్ కార్యాలయానికి చేరుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గోపాస్‌లక్ష్మణ్, గ్రామపంచాయతీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తుమ్మ మహేష్, మండల ప్రధాన కార్యదర్శి లింగస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు, గాలయ్య, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం కార్యవర్గం ఎన్నిక

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 17: తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం అసోసియేషన్(టీఆర్‌ఎస్‌ఎంఏ) జిల్లా నూతన కార్యవర్గం ఏర్పడింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని హిమాలయ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూదన్ ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా వల్లభనేని శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా వెంకటేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షుడు వల్లభనేని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాబోయే కాలంలో నూతన విద్యా విధానం అమలు కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలలు కూడా భాగస్వామ్యం ఉండేలా ప్రవేటు పాఠశాలలను మెప్పిస్తామన్నారు. అదేవిధంగా ఆర్‌టీఈ ద్వారా 25 శాతం విద్యను ఉచితంగా అందించడంలో ప్రభుత్వంతో సమాలోచన జరపడానికి ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. కార్పొరేట్ స్కూల్స్‌ను తరిమేసి రాష్ట్ర పాఠశాల విద్యాలో సగభాగం ఉన్న ప్రవేటు పాఠశాలల అభ్యున్నతి కోసం కృషి చేస్తామన్నారు. అసోసియేషన్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణ్, నాయకులు మహేష్, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు

మన్ననూర్, మార్చి 17: కష్టపడి పనిచేసే కాంగ్రెస్ పార్టీ నాయకులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాధాన్యతనిస్తున్నారని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రీజినల్ చైర్మన్ జూలూరి సత్యనారాయణ అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలిసి ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం కోశాధికారి, టీపీసీసీ అధికార ప్రతినిధిగా ఉన్నటువంటి కల్వ సుజాతను ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా నియమిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. పార్టీ అధికారంలో లేనపుడు కాంగ్రెస్ బలోపేతానికి సైనికుల్లాగా పనిచేసిన నాయకులకు ప్రస్తుతం ఏర్పాటు చేసిన వివిధ కార్పొరేషన్ చైర్మన్లుగా నియమించి వారందరికీ ముఖ్యమంత్రి న్యాయం చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఎక్జిక్యూటివ్ సభ్యుడు సంబు వెంకట్‌రమణ, మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు సంబు శోభ, పద్మజ, నీల కుమార, బిల్లకంటి రమేష్, భాస్కర్, నీల సత్యనారాయణ , బాలింగయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

మూగజీవాల దాహార్తి తీరేది ఎలా?

- కష్టాల్లో పెంపకం దారులు

బల్మూరు, మార్చి 16 : వేసవి రావడంతో ఎండ వడగాలులతో మనుషులతో పాటు మూగజీవాలు తీవ్రంగా అల్లాడుతున్నాయి. మూగజీవాలకు దాహార్తి తీర్చడానికి మూగ జీవాల పెంపకందారులు పడుతున్న కష్టాలు అంతా ఇంతా కావు. నీళ్ల లేక ఇబ్బంది పడుతున్నామంటూ పెంపకందారులు చెప్పకనే చెబుతున్నారు. ప్రత్యామ్నాయంగా వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్తే జీవాలకు నీళ్ల సరిపోకపోవడంతో పాటు భూగర్భ జలాల్లో నీటి మట్టం అడుగంటిపోవడంతో వ్యవసాయ బోరుల్లో కూడా నీరు రావడం లేక అందుకు తోడు వ్యవసాయదారులు కూడా నీరు సరఫరా చేయడానికి ఇష్ట పడడం లేదు. చేసేది లేక మండలంలో పెద్ద చెరువులు ఎక్కడ ఉంటే అక్కడికి జీవాలను తీసుకెళ్లి నీళ్ల తాపి ఇంటికి తీసుకొచ్చే వరకు కాలం వృథా అయి మేత కూడా సక్రమంగా లభించకపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని వారంటున్నారు. వేసవి తాపానికి జీవాలను ఎలా సంరక్షించుకోవాలో అక్కడ నీళ్లను తాపి అక్కడక్కడ ఉన్న చెట్ల కింద జీవాలను ఆపి వాటిని కాపాడుతున్నామని పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండల పశు సంవర్ధక శాఖ లెక్కల ప్రకారం మండలంలో గోజాతి పశువులు 11077 కాగా గేదె జాతి పశువులు 7638, గొర్రెలు 26582, మేకలు 13964 ఉన్నాయని పశువైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. వీటి సంరక్షణ కోసం మండలంలో గోపాలమిత్ర కేంద్రాలు పని చేస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా పశువైద్య కేంద్రం మల్మూరు, తుమ్మన్‌పేట గ్రామాల్లో ఉన్నాయని, ఉప కేంద్రాలుగా కొండనాగుల, జమ్మికుంట, గోదల్, చెన్నారం, రామాజీపల్లి, బాణాల గ్రామాల్లో ఉన్నాయంటూ ఆయన తెలిపారు. జీవాలకు ప్రస్తుతం వేసవిలో వచ్చే వ్యాధులను దృష్టిలో పెట్టుకుని మందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మూగజీవాలను ఉదయం సాయంత్రం వేళల్లో మాత్రమే జీవాలను బయటకు తీసుకెళ్లాలని, ఎండల్లో వాటిని తీసుకెళ్లకూడదని వైద్యులు సలహాలు ఇస్తున్నారు.



వీరంరామాజిపల్లి చెరువులో నీటి మట్టం తగ్గడంతో అల్లాడుతున్న జీవాలు

ఇదిలా ఉండగా మండలంలో ఎక్కడా కూడా సాగునీరందించే పెద్దకాల్వలు లేకపోవడం, చెన్నారం, తుమ్మన్‌పేట, జిన్‌కుంట, గట్టుతుమ్మెన్ ప్రాంతాల్లో సాగునీందించే కాల్వలు ఉన్నప్పటికీ వాటిలో కూడా నీళ్ల రావడం లేదని గొర్ల, మేకల పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నీటి వసతులు ఉండే చోట చూసి నీటి తొట్లను ఏర్పాటు చేశారు. కానీ అవి ఇప్పుడు నీళ్ల లేక విలవిలబోతున్నాయి. వాటిని మళ్లీ మరమ్మతు చేసి నీటిని నింపితే జీవాలకు పునర్జీవం పోసినట్లు ఉంటుందని ఆయా గ్రామాల జీవాల పెంపకందారులు కోరుతున్నారు.

జీవాలకు నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నాం



మూగజీవాలకు నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నాం. గ్రామాలకు సమీపంలో నిర్మించిన నీటి తొట్టిలో నీళ్లను ఉంచితే జీవాలకు ఎంతో మేలు జరుగుతుంది. గ్రామపంచాయతీ వారు చొరవ తీసుకుని నీటి తొట్టెల్లో నీళ్లు నింపాలి.

- గోరే సత్యనారి, రామాజిపల్లి గ్రామం

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసానికి సభ్యుల తీర్మానం

తాడూరు, మార్చి 17 : మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం పీఏసీఎస్ చైర్మన్ ఎండి.సమద్‌పాషపై కొంతమంది సభ్యులు అవిశ్వాసాన్ని ప్రకటించడం జరిగింది. గత 16వ తేదీన చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన లేఖను 9మంది సభ్యులు సంతకాలు చేసి కో ఆపరేటివ్ జిల్లా అధికారికి అందించినట్లు సమాచారం. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడం జరిగింది. తాడూరు పీఏసీఎస్ చైర్మన్‌కు సంబంధించి గత టర్మ్ ఐదు సంవత్సరాలు ప్రస్తుత సింగిల్ విండో చైర్మనే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొనసాగడం జరిగింది. పదవీ కాలం పూర్తవుతున్న నేపథ్యంలో వెనువెంటనే బీఆర్‌ఎస్‌లో చేరి మళ్లీ రెండవసారి చైర్మన్ పదవిని దక్కించుకున్నారు. ప్రస్తుతం రెండవ టర్మ్‌కు సంబంధించి చైర్మన్ పదవీ కాలం నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకుని మరో 11నెలలు పదవీ కాలం ఉంది. అయితే ఇందుకు సంబంధించి తాడూరు మండల కో ఆపరేటీవ్‌కు మొత్తం 13మంది డైరెక్టర్లు ఉన్నారు. 13 మంది డైరెక్టర్లకుగాను ఇందులో సిర్సవాడ, లచ్చిరాం తండా, గుంతకోడూరు, తాడూరుకు చెందిన డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందగా మిగిలిన వారు బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందడంతో చైర్మన్‌గా బీఆర్‌ఎస్ పార్టీకి అవకాశం దక్కింది. ప్రస్తుతం 13మంది డైరెక్టర్లలో నలుగురు కాంగ్రెస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు ఉండగా మరో ఐదుగురు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తూ ప్రస్తుత చైర్మన్ ఎండి.సమద్‌పాషపై అవిశ్వాసం వ్యక్తం చేస్తూ అందుకు సంబంధించిన తీర్మానం కాపీని కో ఆపరేటివ్ జిల్లా అధికారికి అందించారు. అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన సమావేశం నేడు లేదా రేపు అధికారులు నిర్వహించి అవిశ్వాసాన్ని పరీక్షించనున్నారు. అనంతరం అవిశ్వాసం తీర్మానం నెగ్గినట్లయితే వెనువెంటనే రెండు మూడు రోజుల్లో నూతన పీఏసీఎస్ చైర్మన్‌ను ఎన్నుకోనున్నట్లు సమాచారం. ప్రస్తుత పరిణామాలు చూసినట్లయితే బీఆర్‌ఎస్‌కు చెందిన డైరెక్టర్లు సైతం కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ప్రస్తుత సింగిల్ విండో వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి సైతం ఈ అవిశ్వాస తీర్మానంలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత చైర్మన్ 1/3వంతుగా సభ్యులను అవిశ్వాసంలో నిరూపించుకోనట్లయితే కొత్త చైర్మన్ ఎన్నిక లాంఛనమే. పోటీలో తుమ్మలసూగురు విశ్రాంత మాజీ వ్యాయామ ఉపాధ్యాయుడు సింగిల్ విండో డైరెక్టర్ రాంచంద్రారెడ్డి చైర్మన్‌బరిలో ఉన్నారు.

ఘనంగా తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలు

లింగాల, మార్చి 17: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న తిరుమలయ్య గుట్టపై శనివారం రాత్రి తిరుమలేశుని బ్రహ్మోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బల్మూరు మండలానికి చెందిన భక్తులు ప్రతి ఏటా మాదిరిగానే గుట్టకు చేరుకొని రాత్రి వేళ అఖండ భజనకీర్తనలతో జాగారం చేస్తూ తమ తమ మొక్కులను తీర్చుకుంటారు. ఆదివారం ఉదయం తిరుమలేశుని ఉత్సవ విగ్రహాన్ని తలపై ఉంచి దాదాపుగా 250 అడుగుల ఎత్తులో ఉన్న కొండను భజన కీర్తనలలో అలసట లేకుండా ఎక్కి అక్కడ ఉత్సవ విగ్రహాలను ఉంచి అనాదిగా వస్తున్న కుల ఆచారం ప్రకారం పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించి తమ మొక్కులను తీర్చుకుంటారు. ఈ ఉత్సవాలు ప్రతీ ఏటా ఇదే మాసంలో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో పూజారులు తమటం సత్యనారాయణ, టి.రఘునందన్, శ్రీశైలం, ఎం.వెంకట్ నారాయణ భాస్కర్, విజయకృష్ణ, రమాకాంత్, అశోక్, బి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలేశుని ఉత్సవాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న భక్తులు



ఉత్సవ విగ్రహంతో కొండపైకి వెళ్తున్న భక్తులు



మల్లేశ్వరి మాతకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో మల్లేశ్వరి మాత బోనాలు

నాగర్‌కర్నూల్ టౌన్: మేదర్ల కుల దైవం మాత మల్లేశ్వరి అమ్మవారి బోనాల పండుగను ఆదివారం నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని నాగనూలులో ఘనంగా నిర్వహించారు. మేదర మహిళలు సాంప్రదాయ రీతిలో బోనాలను అలంకరించి మల్లమ్మ అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మేదరులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని ఆరాదించారు. కార్యక్రమంలో మేదరులు పోలేపల్లి వెంకటరాములు, పరమేశ్వర్, మహాలింగం, సూర్యరాజు, చంద్రమౌళి, పులి వెంటకస్వామి, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవాలను పురస్కరించుకొని తాము అనుకున్న కోరికలు నెరవేరినందుకు గత మూడు సంవ్సరాలుగా శమంతకమణి బాలకృష్ణ దంపతులు ఏటా అన్నదానం నిర్వహిస్తారు.

కోడేరు ఎంపీపీపై చర్యలు తీసుకోవాలి

- ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 17: కోడేరు ఎంపీవో శ్రావణ్‌కుమార్‌పై దాడికి పాల్పడిన ఎంపీపీ కొండా రాధపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జిల్లా అధ్యక్షుడు పి.రాజశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి భగవేణి నరసింహలు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఉన్న ఎంపీవో శ్రావణ్‌కుమార్‌ను ఎంపీపీ తన చాంబర్‌కు పిలిచి చెప్పుతో కొట్టడం దారుణ చర్యని, దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడిని ఖండిస్తూ తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం సోమవారం జిల్లా వ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేయాలని వారు పిలుపునిచ్చారు.

● ఉద్యోగులపై దాడులు అప్రజాస్వామికం: టీఎస్‌యూటీఎఫ్

విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడులు చేయడం అప్రజాస్వామికమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.కృష్ణ, ఎం.శ్రీధర్‌శర్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోడేరు మండల ఎంపీవో శ్రావణ్‌కుమార్‌పై దాడి సంఘటనలో విచారణ జరిపించి దాడికి పాల్పడిన ఎంపీపీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

ఎంపీపీని అరెస్టు చేయాలి

కోడేరు: ఎంపీవో శ్రావణ్‌కుమార్‌పై మండల అధ్యక్షురాలు కొండా రాధ దాడి చేయడం హేయమైన చర్యగా పేర్కొంటూ ఆమెను అరెస్టు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రెసిడెంట్ రాసూరి రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ అధికారిని తన చాంబర్‌కు పిలిపించి చెప్పుతో కొట్టడం సభ్యసమాజం తల దించుకునే విధంగా ఉందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా సోమవారం ఉదయం 11గంటలకు కార్యదర్శులందరూ ఎంపీడీవో ఆఫీస్ ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తామని అన్నారు. మండల కార్యదర్శులు, గౌరవ అధ్యక్షుడు రాఘవేంద్ర, ఉపాధ్యక్షురాలు శిల్ప, కోశాధికారి ఉదయ్‌కుమార్, కార్యదర్శులు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

● ఉప్పునుంతల: కోడేరు ఎంపీవో శ్రావణ్‌కుమార్‌పై శనివారం ఎంపీపీ రాధ చెప్పుతో కొట్టిందని, చట్ట పర్యమైన చర్యలు తీసుకోవాలని ఉప్పునుంతల ఎంపివో నారాయణ, జిల్లా నాయకులు వెంకటయ్య, చంద్రశేఖర్, వెంకటేష్, నర్సింహ, కర్ణలు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

'ఆదివాసీ కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం'

మన్ననూర్, మార్చి 17: కొమరం భీమ్ ఆదివాసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని మన్ననూరు ఎంపీటీసీ దాసరి శ్రీనివాసులు, రాష్ట్ర ఆదివాసీ సంఘం నాయకులు రాజేంద్రప్రసాద్, శంకరయ్య, అయోధ్య, కేశవులు, చిర్రరాములు అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీ సామాజిక వర్గం చాలా ఏళ్లుగా హక్కుల సాధన కోసం అనేక పోరాటాలు చేయగా, తమ వర్గానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినందుకు వారు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

క్రీడల శాఖ చైర్మన్‌ఎన్నికపై హర్షం

తిమ్మాజిపేట, మార్చి 17 : రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డిని క్రీడల శాఖ చైర్మన్‌గా ఎన్నిక పట్ల జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దానం బాలరాజు హర్షం వ్యక్తం చేశారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ పని చేసే వ్యక్తులను గుర్తిస్తుందని అందరికీ అవకాశం ఇస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు.

నేటి నుంచి పది పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా రాయనున్న 10,526 మంది విద్యార్థులు



చారకొండ జడ్పీఉన్నత పాఠశాలలో పరీక్షలకు ఏర్పాట్లు చేసిన అధికారులు

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 17: పదో తరగతి వార్షిక పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పది పరీక్షలు ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరుగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 10,526 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అందులో 5,209 మంది బాలురు ఉండగా 5,317 మంది బాలికలు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 59 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా ముగ్గురు స్క్వాడ్స్‌ను నియమించారు. ప్రతీ పరీక్ష ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు కొనసాగనుంది. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు ఐదు నిమిషాలు వెసులుబాటు ఇచ్చారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ విధించి పర్యవేక్షణకు అవసరమైన పోలీసు సిబ్బందిని నియమించారు. అలాగే పరీక్ష కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని నిర్వాహకులకు విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

భక్తిశ్రద్ధలతో భగవద్గీత పారాయణ పఠనం

కందనూలు, మార్చి 17 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆకారపు వారి శివాలయంలో ఆదివారం భగవద్గీత పారాయణ సామూహిక పఠనం శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు భగవద్గీత పారాయణ కమిటీ అధ్యక్షుడు బిల్లకంటి బాలస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుక్షేత్ర యుద్ధంలో శ్రీకృష్ణ భగవానుడు అర్జునునికి ఉపదేశించిన సారాంశమే భగవద్గీత అన్నారు. భగవద్గీత పారాయణం ప్రతి ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తామని, భక్తులు ఎవరైనా గీతా పారాయణం ఇంట్లో చేయాల్సిన వారు నేరుగా సంప్రదించాలన్నారు. గుజ్జరి నిరంజన్, కొండూరు నరసింహ, రఘునందన్‌గౌడ్, చంద్రమౌళి, రామ్మోహన్, బాలస్వామి, బాలరాజు, మన్యపురెడ్డి, వెంకటశెట్టి శ్రీనివాసులు, సలేశ్వరం, కృష్ణంరాజు, భగవద్గీత పారాయణ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా జగదీశ్వర్‌రావు

కోడేరు, మార్చి 17 : రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం చింతలపల్లి జగదీశ్వర్‌రావును నియమించడంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పస్పుల నాగేంద్రం ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆయనతోపాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిద్దె శాంతయ్య, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వీరపాగ కిరణ్‌కుమార్, సీనియర్ నాయకులు సాయి రాంరెడ్డి, చామంతిరాజు, పుట్ట రాములు, పుట్ట వెంకటస్వామి హర్షం ప్రకటించారు.

ముమ్మరంగా సీసీ రోడ్ల నిర్మాణం

బిజినేపల్లి, మార్చి 17 : ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైన నిధులతో గ్రామాల్లో ముమ్మరంగా నూతన సీసీ రోడ్ల నిర్మాణం పనులు సాగుతున్నాయి. ఆదివారం మండలంలోని వట్టెంలో రూ.30 లక్షలతో దాదాపు 5 వందల మీటర్ల నూతనంగా సీసీ రోడ్ల పనులను ప్రారంభించి కాలనీల్లో వేస్తున్న రోడ్డు పనులను మాజీ సర్పంచ్ బత్తిని అమృత్ రెడ్డి, పరిశీలించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను దుర్వినియోగం కాకుండా సీసీ రోడ్లను నాణ్యతగా వేయాలని వర్కర్లకు సూచించారు. సీసీ రోడ్లు వేయాల్సిన ఉన్న కాలనీల్లోని ప్రజలు అండర్ డ్రైనేజీ మేన్ వాల్‌కు మురుగునీటి పైపులైన్ వేసుకోవాలని కోరారు. సీసీ రోడ్డు పనులు వేసిన తర్వాత పైపులైన్ ఇబ్బందులు వస్తాయని కోరారు.

'ప్రధాని మోదీతోనే అభివృద్ధి సాధ్యం'

కల్వకుర్తి, మార్చి 17 : దేశ ప్రధాని నరేంద్రమోదీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ అన్నారు. ఎన్నికల్లో పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని నిర్వహించిన విజయ సంకల్ప సభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరు కావడం బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపు అయిందన్నారు. తాను ప్రధాని మోదీని ప్రత్యక్షంగా కలవడం సంతోషంగా ఉందని రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

కుష్ఠు వ్యాధిని అరికట్టేలా ఇంటింటి సర్వే

వంగూరు, మార్చి 17: కుష్ఠు వ్యాధిపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడానికి, కొత్తగా లక్షణాలను కలిగిన వ్యక్తులను గుర్తించడానికి మండలంలో ఈనెల 11 నుంచి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని సీహెచ్‌వో సుధాకర్ తెలిపారు. ఆదివారం సర్వేను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మండలంలో 33 మంది ఆశ వర్కర్లతో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని ఈ నెల 24 వరకు సర్వే కొనసాగుతుందన్నారు. ప్రతీ ఇంట్లో ప్రతీ ఒక్కరిని పరీక్షించి వారి శరీరంపై ఏమైన మచ్చలు ఉన్నట్లయితై అనుమానితులుగా గుర్తించి వైద్యాధికారి దగ్గరకు తీసుకెళ్లి పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. మండలంలో ఇప్పటి వరకు 3500ల ఇండ్లకు వెళ్లి ఇంటింటికి సర్వే నిర్వహించామన్నారు. 25 మంది వ్యాధి అనుమానితులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా పరీక్షలు చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ ఆసుపత్రిల్లో అన్ని రకాల వైద్య సేవలు అందుతాయన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

చారకొండ, మార్చి 17: మండల పరిధిలోని అగ్రహారం తండా మాజీ సర్పంచ్ నేనావత్ ప్రశాంత్‌నాయక్‌తో పాటు మరో 30 మంది బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే సహకారంతో తండాను అభివృద్ధి చేసుకుంటామని ప్రశాంత్‌నాయక్ తెలిపారు. పర్వతాలు, పరశురాం, శంకర్, దేవు, రామకృష్ణ, తుల్చనాయక్, రాజునాయక్ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం విజయవంతం

తిమ్మాజిపేట, మార్చి 17 : తిమ్మాజిపేట మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన వినతి వేద ఆయుర్వేదిక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆయుర్వేద వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా శరీరంలోని 36భాగాలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి రిపోర్టులు సంబంధిత వ్యక్తులకు వెంటనే అందజేశారు. రిపోర్టులో సూచించిన వ్యాధులకు ఆర్గానిక్ ఆయుర్వేదిక్ మందులు ఇవ్వడం జరిగింది. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంపై గ్రామీణ ప్రజల్లో అనూహ్య స్పందన కన్పించింది. ఆయుర్వేదిక్ మందులు వాడుకోవడం ద్వారా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని వైద్యులు తెలిపారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా మనిషికి ఎంత మేలు జరుగుతుందో అంతే మేలు ఆర్గానిక్‌తో జరుగుతుందని ప్రతీ ఒక్కరికి వీటిపై అవగాహన ఉండాలని మీ గ్రామాల్లో ఏర్పాటు చేసే శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు ప్రజలకు వివరించారు. వైద్యులు మానస, అశోక్, నికేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 17 : ప్రేమ పేరుతో అమ్మాయిలను వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని షీటీమ్ అధికారి వెంకటయ్య పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సార్వత్రిక అధ్యయన కేంద్రంలో అడిషనల్ ఎస్పీ రామేశ్వర్ ఆదేశాల మేరకు షీటీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించినట్లు షీటీం అధికారి వెంకటయ్య తెలిపారు. నెల్లికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ సందర్భంగా ఆదివారం తరగతులకు హాజరైన అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ విద్యార్థులకు షీటీమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం అధికారి వెంకటయ్య మాట్లాడారు. అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి



బిజినేపల్లిలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బిజినేపల్లి, మార్చి 17 : బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను లిక్కర్ కేసులో ఈడీ అరెస్టు చేసినందుకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు మండల నాయకులు నిరసన చేపట్టి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితను వెంటనే విడుదల చేయకుంటే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు వైస్ ఎంపీపీ చిన్నారెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరసింహ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు చీర్డం బాలస్వామి, వేముల తిరుపతయ్య, రాధా తిరుపతి రెడ్డి, కోఆప్షన్ మెంబర్ జహంగీర్, మాజీ సర్పంచులు గుడిసె తిరుపతయ్య, ఎల్లస్వామి, సట్ల కృష్ణయ్య, ఊర్కొండ రఘుబాబు, ఐల రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.